క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



నూతన తాగునీటి పంపును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశాలతో మండలంలోని చిన్నపరెడ్డిపల్లిలో తాగునీటి పంపును అధికారులు ఏర్పాటు చేయడంతో నీటి సమస్య పరిష్కారమైంది. ఇటీవల మంత్రి ఉషశ్రీ చరణ్ గ్రామంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో అధికారులు వెంటనే నూతన బోరుబావి తవ్వించి మోటరును బిగించారు. నీటి సమస్య పరిష్కారమవడంతో మంత్రి ఉషశ్రీచరణ్‌కు సర్పంచ్ అశ్వర్థనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

జలసంఘాలు ఏర్పాటు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ ధనుంజయ

సోమందేపల్లి: జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా జల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ ధనుంజయ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి జల జీవన్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ నాగరాజురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, ఏపీఎం రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మడకశిర: వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యకర్తల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో జరుగుతుందని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ కమిటీల ఏర్పాటుపై సమావేశంలో చర్చిస్తామన్నారు. పట్టణంలోని అన్ని వార్డులు, బూత్‌ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న పోస్టల్ డివిజనల్ అధికారి మార్కండేయులు

హిందూపురం అర్బన్: 'జనంలోకి మనం' కార్యక్రమం శుక్రవారం త్యాగరాజునగర్ సచివాలయంలో హిందూపురం హెడ్ పోస్టుమాస్టర్ అందెల మార్కండేయులు అధ్యక్షతన జరిగింది. పోస్టల్ ఖాతాలు, పథకాలపై ఆయన మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణ, నసీమా పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి సహకరిస్తాం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో నిర్మించనున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవన నిర్మాణం, స్మృతివనం, విగ్రహ ప్రతిష్టాపనకు తనవంతు సహకారం అందిస్తానని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి, సర్పంచ్ వాగేష్ తెలిపారు. శుక్రవారం మండల కాంప్లెక్స్ పక్కన నిర్మాణం చేస్తున్న డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణం , విగ్రహ ప్రతిష్టాపన చేసే స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం దళిత నాయకులు వాగేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నారయణ, కెంచప్ప, సిద్ధేశ్వర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాజ్యాంగ చైతన్యయాత్ర



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీల్లో సాగిన రాజ్యాంగ చైతన్య రథ యాత్ర శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గుజ్జనడు, సీకే పుర, బ్యాడనూరు, కన్నేడి, నలిగానహళ్లి గ్రామ పంచాయతీల్లో యాత్రకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. బ్యాడనూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ఏ ఒక్క జాతికో మతానికో చెందిన కాదన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఆశయాల గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

ఆసరాతో మహిళలకు భరోసా

- వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో అక్కచెల్లెమ్మల రుణాల మాఫీ
- మడకశిర నియోజకవర్గంలో రూ.114.91 కోట్ల లబ్ధి
- సీఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని మహిళల హర్షం



నియోజకవర్గంలోని మహిళా సంఘాల సభ్యులు

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల రుణాలను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పూర్తిస్థాయిలో మాఫీ చేశారు. నాలుగు విడతల్లో రుణాలన్నీ మాఫీ చేస్తానని ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు మహిళా సంఘాల రుణాలన్నీ మాఫీ చేశారు. 2019 ఏప్రిల్ 11 వరకూ సంఘాల్లో మహిళలు తీసుకున్న రుణాలన్నీ ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేయడంతో అక్కచెల్లెమ్మలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలను మోసం చేసిన చంద్రబాబు

2014 ఎన్నికల సందర్భంలో మహిళా సంఘాల రుణాలన్నీ మాఫీ చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే చంద్రబాబు ఈ హామీని గాలికొదిలేశారు. రుణాలు మాఫీ చేయకుండా మహిళలను నిండా ముంచేశారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయినా మహిళలకు ఇచ్చిన హామీని మాత్రం అమలు చేయలేదు. అదిగో ఇదిగో అంటూ రుణాలు మాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారు. అయితే వైఎస్ జగన్ మాత్రం మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం రుణాలు మాఫీ చేసి అండగా నిలబడ్డారు.

114.91 కోట్ల రుణాలు మాఫీ

నియోజకవర్గంలో 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి మహిళా సంఘాల రుణాలు రూ.114.91 కోట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో రూ.103.13 కోట్ల రుణాలు ఉండగా.. పట్టణ ప్రాంతంలో రూ.11.78 కోట్ల రుణాలు ఉండేవి. ఈ రుణాలన్నీ మాఫీ చేస్తామని వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. చెప్పిన విధంగా నాలుగు విడతల్లో రుణాలన్నీ మాఫీ చేశారు.

మడకశిర నియోజకవర్గంలో ఆసరా ఇలా..

విడతల వారీగా	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లల్లో)
మొదటి విడత	3,923	25.74
రెండో విడత	3,932	25.84
మూడో విడత	3,930	25.77
నాల్గో విడత	3,930	25.78

మడకశిర అర్బన్‌లో ఇలా...

మొదటి విడత	4,252	2.91
రెండో విడత	4,295	2.98
మూడో విడత	4,295	2.95
నాల్గో విడత	4,295	2.95

రుణమాఫీతో ఊరట



నా అవసరం కోసం సంఘంలో రుణం తీసుకున్నా. ప్రతి నెలా రుణాన్ని కంతుల ప్రకారం చెల్లించడానికి ఇబ్బంది పడాల్సి వచ్చేది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పిన మాట ప్రకారం సంఘాల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేశారు. నేను తీసుకున్న రుణాన్ని వైఎస్సార్ ఆసరా ద్వారా 4 విడతల్లో ప్రభుత్వమే చెల్లించడంతో ఊరట లభించింది.

– విమలాక్షమ్మ, ఫళారం, గుడిబండ మండలం

జగన్ మహిళా పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళా పక్షపాతి. సంఘాల రుణాలను మాఫీ చేస్తానని చెప్పారు. మాట ప్రకారం రుణాలను మాఫీ చేసి అక్కా చెల్లెమ్మలకు అండగా నిలబడ్డారు. ఎంతో మంది మహిళలు రుణభారం నుంచి బయటపడ్డారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుంది.

– హనుమక్క, గుడిబండ

చంద్రబాబు మోసం చేశారు



మహిళలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుది. 2014లో రుణాలు మాఫీ చేస్తానని చెప్పి పైసా మాఫీ చేయలేదు. మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టారు. అయితే వైఎస్ జగన్ మహిళలకు అండగా నిలబడ్డారు. రుణమాఫీ చేసి మాట నిలుపుకున్నారు.బ జీవితాంతం వైఎస్ జగన్‌కు అండగా ఉంటాం. మళ్లీ చంద్రబాబును నమ్మి మహిళలు మోసపోరు.

– ప్రియాంక, ఫళారం, గుడిబండ మండలం

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: 'సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోంది. అన్నిరకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది'. అని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. పట్టణంలోని నవీన్‌నిశ్చల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు ఆయన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తూ సీఎం వైఎస్ జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం హిందూపురానికి చెందిన షేక్ మహబూబ్‌కు రూ.లక్ష, జూమాకులపల్లికి చెందిన రామాంజినమ్మకు రూ.45 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షద్ అహ్మద్, నాయకులు నరసింహారెడ్డి, ఆజాం, కట్ట ప్రమోద్, సల్మాన్, వరుణ్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లి, కేతగాని చెరువు, చాలకూరు, బ్రాహ్మణపల్లి, పందిపర్తి ఈదుళ బలాపురం, జూలకుంట, మండ్లి, బ్రహ్మసముద్రం గ్రామాల్లో శనివారం మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పర్యటిస్తున్నట్లు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

కలెక్టర్‌ను కలిసిన ఈర లక్కప్ప



కలెక్టర్ అరుణ్‌బాబును కలిసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలెక్టర్ అరుణ్‌బాబును కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు ఈర లక్కప్ప తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, నిధులు మంజూరు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రజలను ఆదుకోవాలని కోరినట్లు చెప్పారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరినట్లు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజగౌడ్, మాజీ ఎంపీపీ బజ్జప్ప, సర్పంచ్ అశ్వర్థ ఉన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం హిందూపురం మండలం బీరేపల్లి గ్రామ పంచాయతీలో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వేణురెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ ఐదేళ్లలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి ఒక్క అవకాశం ఇస్తే పురంను అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

కార్యకర్తకు పరామర్శ

పట్టణంలోని 38వ వార్డు సింగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రఫిక్ ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి... రఫిక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

జగనన్న కోసం సైనికుల్లా పనిచేయాలి

- మంత్రి ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి , వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్

పరిగి: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా చేసుకుందామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఏడు పంచాయతీ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించారు. తొలుత పైడేటిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శీగిపల్లి, బీచిగానిపల్లి, ఊటుకూరు, ఎర్రగుంట, శాసనకోట, హొన్నంపల్లి గ్రామ పంచాయతీ కేంద్రాలలో విడిగా సమీక్షలు నిర్వహించారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సిద్ధం ఉండాలని మంత్రి ఉషశ్రీ చరణ్ పార్టీ శ్రేణులకు సూచించారు. సీఎం జగన్... గడిచిన నాలుగున్నరేళ్లుగా ప్రజా సంక్షేమానికి 124 బటన్లు నొక్కారని... వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించడానికి రెండు బటన్లు నొక్కి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను అందించి, అవినీతి అక్రమాలకు తావు లేకుండా పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు.

టీడీపీని భూస్థాపితం చేద్దాం

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని భూస్థాతం చేద్దామని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఇప్పటి వరకూ కనీసం ఆపార్టీ తరఫున అభ్యర్థులను ప్రకటించపోవడంపై ప్రజల్లో ఎన్నో సందేహాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి టీడీపీ శ్రేణులకు వణుకు పుడుతోందన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ఏనాడైనా ప్రజల ఆర్థికాభివృద్ధికి పాటుపడ్డారా? అని ప్రశ్నించారు. కేవలం తన పార్టీ శ్రేణులకు దోచిపెట్టడంతో పాటూ పచ్చ మీడియాకు ప్రజాధనాన్ని పంచిపెట్టారని విమర్శించారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేయడంతో పాటూ ప్రజలకు రక్షణ లేకుండా చేసి, రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రతిపక్ష టీడీపీతో వివిధ పార్టీల మూకలన్నీ ఏకమవుతున్నాయని...వారెంత మంది వచ్చినా...జగనన్న సింగల్‌గానే వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, సర్పంచ్‌లు గంగాదేవి, లక్ష్మన్న, దిలీప్, బాలకృష్ణ, మాలతి, మంజునాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు బెస్త నాగజ్యోతి, అమరావతి, గంగాదేవి, జేసీఎం మండల కన్వీనర్ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొటేషన్ల ఆహ్వానం

లేపాక్షి: వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 7 నుంచి 11 తేదీ వరకూ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయానికి అవసరమయ్యే సామగ్రి కోసం వ్యాపారుల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు. సున్నం పూత, నీలి వగైరాలు, వస్త్రాలు , లైటింగ్ డెకరేషన్, పూజా ద్రవ్యాలు, పూలమాలలు, హారాలు, వంట కూలీలు, పాలు, పెరుగు, అచ్చు పనులు, మెటల్ పాలిష్, తేరు రిపేరీ తదితర వాటి కోసం నాలుగు రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తప్పొప్పులు గుర్తించండి

పరిగి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ బూత్ లెవెల్ స్థాయిలో రూపొందించిన ఓటరు జాబితాలో తప్పొప్పులను గుర్తించాలని తహసీల్దారు రాజేశ్వరీ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల వ్యాప్తంగా ఉన్న బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులతో ఆమె ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. డీటీ లక్ష్మీనరసింహ, సీనియర్ అసిస్టెంట్ మురళిధర్, ఆర్‌ఐ సిద్దేశ్వర్, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలపై నేడు సమావేశం

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు లేపాక్షిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఈఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి పంచాయతీ పరిధిలో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



నరసింహమూర్తి (ఫైల్)

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామానికి చెందిన రైతు గాదరప్ప కుమారుడు నరసింహమూర్తి (39) గుండెపోటుతో శుక్రవారం చనిపోయాడు. పొలంలో పనిచేస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య కవితతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం, కల్లుమర్రి, మడకశిర విద్యుత్ ఉప కేంద్రాల్లో 33 కేవీ లైను అత్యవసర మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మహేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రథోత్సవ ఏర్పాట్ల పరిశీలన

హిందూపురం: పట్టణంలో వెలసిన పేట వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. ఏర్పాట్ల పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నవీన్ భగీరథ, కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రథోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లి క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని టాటాఏస్ వాహనం ఢీ కొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చిలమత్తురు మండలం కొర్లకుంటకు చెందిన నాగరాజు (42) స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో లేపాక్షికి వస్తున్నాడు. అయితే చిలమత్తూరు మండలం దేమకేతేపల్లికి చెందిన రంగప్ప లేపాక్షి నుంచి సోమిరెడ్డిపల్లికి టాటాఏస్ వాటర్ ట్యాంకర్‌కు తరలిస్తున్నాడు. గొంగటిపల్లి క్రాస్ వద్ద టాటాఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన నాగరాజును బెంగళూరుకు తరలించారు. క్షతగాత్రుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మడకశిర సీఐగా రాజకుమార్

మడకశిర: మడకశిర సీఐగా రాజకుమార్‌ను నియమిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను కర్నూలు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే రాజకుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



సెబ్ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

హిందూపురం అర్బన్/చిలమత్తూరు: 'సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, గుట్కా తరలిరాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.. ప్రతి వాహనాన్ని సిబ్బంది కచ్చితంగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలి' అని సెబ్ అధికారులను డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సరిహద్దున ఏర్పాటు చేసిన తూమకుంట, కొడికొండ చెక్‌పోస్టులను సిబ్బందితో కలిసి ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన ఒక్క మద్యం బాటిల్ కూడా తీసుకొచ్చేందుకు అనుమతులు లేదని స్పష్టం చేశారు. అనంతరం హిందూపురం సెబ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. హిందూపురం సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్, కొడికొండ చెక్‌పోస్టు సీఐ శ్రీరాములు, తూమకుంట ఎస్‌ఐ చాంద్‌బాషా ఉన్నారు.

విదేశీ మద్యం మాయంపై ఆరా

కొడికొండ చెక్‌పోస్టులో ఈ నెల 7వ తేదీన పట్టుబడిన విదేశీ మద్యం మాయం విషయంపై సెబ్ డిప్యూటీ కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విదేశీ మద్యానికి సంబంధించి 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంపై ఆయన ఆరా తీసినట్లు సమాచారం. నిందితుడిని తప్పించే ప్రయత్నం చేశారా? లేక విలువైనవని దాచేశారా? అనే కోణంలో సిబ్బందిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. కార్యక్రమంలో సెబ్ సీఐ బండి శ్రీరాములు, ఎస్‌ఐ ఇంతియాజ్ , సిబ్బంది హాజరయ్యారు.

ద్విచక్ర వాహనం అపహరణ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద ద్విచక్ర వాహనం చోరీ అయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే ... మండలంలోని శెట్టిపల్లికి చెందిన కరీం అనే వ్యక్తి ఆస్పత్రికి సమీపంలో ద్విచక్ర వాహనం నిలిపి సమీపంలోనే ఉన్న టీ దుకాణం వద్దకు వెళ్లాడు. టీ తాగిన అనంతరం బండి నిలిపిన ప్రాంతానికి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితుడు పోలీసును ఆశ్రయించాడు.

చిలమత్తూరులో...

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లిలో గురువారం రాత్రి చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం (హోండా షైన్) అపహరణకు గురైంది. ఇంటి ముందు ఆపి ఉంచిన బైక్‌ను ఇద్దరు దొంగలు దొంగిలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో లభించాయి. ఈ ఘటనపై చెన్నకేశవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అమరాపురం: లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



పావగడ: శనీశ్వరస్వామి, జ్యేష్ఠాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో వెలసి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు సంప్రదాయ బద్ధంగా స్వామివార్ల కల్యాణాన్ని జరిపించారు. ఇదిలా ఉండగా.. శనివారం బ్రహ్మ రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

పావగడ: స్థానిక శనీశ్వరస్వామి జాతరోత్సవాల్లో భాగంగా శనీశ్వరస్వామి, జ్యేష్ఠాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రత్యేక మంటపంలో ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో అశేష భక్త జనసందోహం మధ్య అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు.